సాక్షి నిర్మల్

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

ఎకో ఫ్రెండ్లీ గణపతి



నర్సాపూర్ (జి): మండల కేంద్రానికి చెందిన సబ్బన్ సాయికృష్ణ అనే యువకుడు ఎకో ఫ్రెండ్లీ పేపర్ గణపతి విగ్రహాలను తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. జూనియర్ ఆదర్శ యూత్ యువకుల సహాయంతో ఏటా పర్యావరణానికి హాని కలగకుండా పేపర్ గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ ఏడాది శ్రీకృష్ణుడు తల్లి యశోదతో కలిసి ఉన్న రూపంలో గణపతి విగ్రహం తయారు చేస్తున్నారు. దీనిని స్థానిక పెద్ద హనుమాన్ ఆలయం ఆవరణలో ప్రతిష్టిస్తారు.

గరిష్టం/కనిష్టం
29.1 /24.2

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

వెల్‌కం.. గణేశా



నిర్మల్: 'మూషికా.. అదిగో భూలోకం రానేవచ్చిందిగ. అసలు ఏడాదికాలం ఇట్టే గడిచిపోయింది. నాకైతే మొన్నమొన్ననే వచ్చివెళ్లామన్నట్లుగా ఉంది. ఈ ఏడాదికాలంలో ఏమేం జరిగాయో కదా..! '

'ఏడాది ఎంతసేపు స్వామీ.. చూస్తూ ఉంటే ఏళ్లకేళ్లే గడిచిపోతున్నాయి. అదిగో గణనాథా.. మనం చేరాల్సిన మండపం. చూస్తుంటే.. ఈసారి నిర్మల్ జిల్లా వాసులు మీకు భారీగానే సమస్యల చిట్టా వినిపించేలా ఉన్నారు స్వామీ..'

'అవునా.. ఎందుకలా.. ఏంటా సమస్యలు మూషికా..!?'

'కాసేపు ఆగు స్వామి.. పూజాకార్యక్రమాలు పూర్తవ్వగానే మీ భక్తులే మీకు వినిపిస్తారుగా..'

'అంతే అంటావా మూషికా..? సరే కానీ..'

- అందుకో.. మా సమస్యల స్వాగతం..
- గంజాయి మత్తులో ఉన్న యువతను..
- 'కాయిన్స్'లో కూరుకుపోయిన సార్లను..
- ఆక్రమణల పాలైన చెరువులను..
- జ్వరాలతో బాధపడుతున్న జిల్లాను..
- ఇక నువ్వే కాపాడాలి.. గణనాయకా..!

యువతను పీల్చేస్తున్న గంజాయి..

స్వామీ.. గంజాయి మహమ్మారి ఏడాదికేడాది జిల్లాలో విస్తరిస్తూనే ఉంది. పోలీసులు, సంబంధిత శాఖాధికారులు ఎంత కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నా.. సాధ్యం కావడం లేదు. ఎంతమందిని అరెస్టు చేస్తున్నా.. దందా ఆగడం లేదు. లేలేత వయసులోనే యువతను పీల్చిపిప్పిచేస్తోంది. బడికెళ్లే వాళ్లలోనూ గంజాయి బాధితులున్నారంటే శోచనీయం. ఇక గంజాయి వలలో చిక్కిన కొంతమంది ఎంతటి దారుణాలకైనా తెగబడుతున్నారు. ఎలాగైనా ఈ గంజాయి భూతం పనిపట్టే పరిష్కారం చూపు స్వామీ.

'కాయిన్స్'వేటలో జైలు పాలై..

గణనాథా..! ఈ విషయం చెప్పాలంటేనే ఓ రకంగా సిగ్గేస్తోంది. ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులై ఉండి అత్యాశకు పోయి అవస్థలు పడుతున్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ కాసులు వస్తాయన్న కక్కుర్తిలో పడి జైలుపాలయ్యారు. తమలాగే ఎన్నో కుటుంబాలను తయారు చేసి, వాళ్లనూ ఆందోళనలో పడేశారు. తమ కుటుంబాలకూ బాధను మిగిల్చారు. యూబిట్ పేరిట జరిగిన దందా ఇటీవల జిల్లాను కుదిపేస్తోంది. సమాజానికి ఆదర్శంగా నిలువాల్సిన ఉపాధ్యాయులు, ఉద్యోగులే ఇలాంటి పనులు చేయడం దారుణం కదా స్వామి..!

నిమజ్జనానికైనా మిగలాలి కదా..

స్వామి ఇది మా సమస్యే కాదు.. రేపొద్దున మీకు కూడా ఎదురు కావొచ్చు. ఏంటంటారా..!? నిండు కుండల్లా ఉండే చెరువులను నీటి చుక్క లేకుండా చేస్తూ.. చివరకు చెరువే లేకుండా చేసే పని శరవేగంగా సాగుతోంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా జిల్లాలో చెరువులు కబ్జా అవుతున్నాయి. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న 'హైడ్రా' బుల్డోజర్ రావాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు స్వామి. లేదంటే కొన్నేళ్ల తర్వాత మీ ప్రతిమల నిమజ్జనానికీ నీటిచుక్క ఉండదేమో గణేశా..!?

తీరని కోర్కెలెన్నో స్వామీ..

వినాయకా.. గత ఏడాది కోరిన కొన్ని కోర్కెలనూ పెండింగ్‌లో పెట్టారు. బాసర సరస్వతమ్మ కొలువైన జిల్లాలో ఇంజినీరింగ్‌తోపాటు పీజీ విద్య ఇప్పటికీ అందని ద్రాక్షగానే ఉంది. ఇథనాల్, పామాయిల్ వంటి పరిశ్రమలు వచ్చినప్పటికీ.. వాటిని ఏర్పాటు చేస్తున్న స్థలాలే స్థానికులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. ఇబ్బందికర పరిస్థితులు లేకుండా మరిన్ని పరిశ్రమలు జిల్లాకు రావాలి. ఇక్కడి యువత ఎడారి దేశాలకు వెళ్లే బాధలు పోవాలి.

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ..
గణపతి బప్పా మోరియా.. గణేశాయా పానీలాయా..
హమ్మయ్యా.. గణపయ్య వచ్చేశావా..!
స్వాగతం స్వామీ.. సుస్వాగతం. మీ రాక కోసం, ఈ వేడుక కోసం ఏడాదంతా ఎదురుచూస్తూ నే ఉంటామయ్య. నువ్వొస్తున్నావంటేనే ఊరంతా పండుగ వాతావరణం. గల్లీగల్లీలో మీరు కొలువుదీరి ఉండే ఈ నవరాత్రులు నిత్యం కోలాహలమే. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరం కలిసి మిమ్మల్ని వేడుకోవడమే.
స్వామీ.. ఇక మాకష్టాలు నాయకులకు ఎలాగూ పట్టవు. అధికారులు ఉన్నా పెద్దగా మార్పు ఉండదు. అందుకే ప్రతిసారీ మీకు మొరపెట్టుకుంటాం.

'విన్నావా ప్రభూ..! ఇవీ నిర్మల్ జిల్లావాసుల సమస్యలు. వారు కోరుతున్న కోర్కెలు..!'

'అవును మూషికా.. విన్నాను. జిల్లా ప్రజలవి న్యాయమైన విన్నపాలే. వీటిలో చాలావరకు ఇక్కడి పాలకులు, అధికారులే కాసింత దృష్టిపెడితే పరిష్కారమవుతాయి. మిగితావి కాలంతోపాటు పరిష్కారమయ్యేలా మన వంతు సహకారం అందిద్దాం..'

వర్షాలు.. జ్వరాలు..

ప్రభూ.. జరజాగ్రత్త..! మూషికా.. స్వామివారికి దోమలు కుట్టకుండా చూసుకో. మేమెన్ని మస్కిటో కాయిల్స్ వెలిగించినా.. ఎన్ని లిక్విడ్ మిషీన్లు పెట్టినా దోమలు పోవడం లేదు. ప్రాణాంతక డెంగీతో పాటు చికున్‌గున్యా, మలేరియాలను వ్యాపింపజేస్తూ కనీసం ఇంటికొకరినైనా ఆస్పత్రి పాలుచేస్తున్నాయి. అరకొర సిబ్బందితో పంచాయతీలు, మున్సిపాలిటీలు చేపడుతున్న దోమల నివారణ చర్యలు ఏమూలకూ సరిపోవడం లేదు.

ఆయారే.. గణేశ్

- జిల్లాలో ప్రత్యేకం.. వినాయకుల ప్రతిష్టాపన
- తరతరాలుగా ఇదే సంప్రదాయం
- లక్షలాది మంది భక్తుల రాక

తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు మండలాల్లో ప్రతీ ఏడాది పర్యావరణ హితుడైన పార్వతి పుత్రుడు కొలువుదీరడం ఈ ప్రాంత ప్రత్యేకత. ఒకప్పటికి కరువు పరిస్థితుల్లో మొదలుపెట్టిన కర్ర గణపతి ప్రతిష్టాపనోత్సవం తరాలుగా అలాగే కొనసాగుతోంది. తమ పెద్దలు చూపిన పర్యావరణ పరిరక్షణ సూత్రాన్ని ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కర్ర వినాయకులను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయనిక రంగులులేకుండా మట్టితోనూ సంబంధంలేకుండా కర్ర వినాయకులను ప్రతిష్టించి పూజలుచేస్తారు.



మహారాష్ట్రలోని పాలజ్‌లో కర్ర వినాయకుడు

భైంసా: స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ప్రజలను ఏకతాటిపైకి తెచ్చేందుకు లోకమాన్య బాల గంగాధర్‌తిలక్, పుణేలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. 1948 సమయంలో సరిహద్దు మహారాష్ట్రలోని పాలజ్‌లో కలరా, ప్లేగువ్యాధులు ప్రబలాయి. కరువు కాటకాలు ఏర్పడ్డాయి. ప్రజలకు తాగడానికి నీరుకూడా దొరకలేదు. అలాంటి సందర్భంలో వినాయక చవితి రావడంతో అక్కడి ప్రజలు నిమజ్జనం పరిస్థితిలేనందున నీటితో అవసరంలేకుండా కర్రతో గణపతిని తయారు చేయించారు. మహారాష్ట్రలోని భోకర్ తాలుకా పాలజ్ గ్రామంలో 1948లో నిర్మల్‌లో కొయ్యబొమ్మలు చేసే నకాశీ కళాకారుడైన గుండాజీ వర్మను కలిశారు. ఆయన నిష్టతో ఒకే కర్రతో సహజ సిద్ధమైన రంగులతో గణపతిని తయారుచేసి ఇచ్చారు. కర్ర గణపతి ప్రతిష్టాపనతో పాలజ్ గ్రామంలో వ్యాదులు దూరమయ్యాయి. కొంతకాలానికే కరువు కాటకాలు రాలేదు. కర్ర గణపతి రాకతోనే తమ ఊరు మారిందని నమ్ముతూ గ్రామస్తులంతా ఏటా కర్ర గణపతినే పూజిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇదే విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. 11 రోజులు ముగియగానే నీళ్లు చల్లి ప్రత్యేక బీరువాలో భద్ర పరుస్తున్నారు. పాలజ్ గ్రామంలో ఇప్పుడు భారీ మండపాలు నిర్మించారు. ఈ కర్ర గణేశున్ని దర్శించుకునేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారు.

భోసి గ్రామంలోనూ...

తానూరు మండలం బోసి గ్రామంలోనూ గుండాజీ వర్మ తయారుచేసిన కర్ర వినాయకున్నే ప్రతిష్టిస్తారు. మహారాష్ట్రలోని చికిలి గ్రామంలోనూ కర్ర వినాయకున్ని ప్రతిష్టిస్తారు. మూడు విగ్రహాలను ఒకే కళాకారుడు చెక్కారు. 70 ఏళ్లుగా ఇక్కడ కర్ర వినాయకులను ప్రతిష్టించి పూజలుచేస్తున్నారు. భైంసా మండలం మాటేగాంలోనూ కొరడి గణపతి ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు. కుభీర్‌లోనూ కర్ర వినాయకున్నే ప్రతిష్టిస్తారు. కుభీర్ మండలం పార్డి, మాలేగాం గ్రామాల్లోనూ కర్ర వినాయకులనే ప్రతిష్టిస్తున్నారు. నిర్మల్‌లోని విశ్వకర్మ సంఘంలో ఏడేళ్లుగా కర్ర గణపతిని ప్రతిష్టిస్తున్నారు.

కరుణించే కర్ర వినాయకుడు ..

తానూరు : భోసి గ్రామంలో కొన్నేళ్లుగా వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించే గణనాథుడు భక్తులను ఆకర్శిస్తున్నాడు. ఇక్కడ నెల కొల్వే కర్ర వినాయకుని పూజిస్తే రోగాలు రావని .. మొక్కి ముడుపుకడితే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో ఏటా భక్తులు వేల సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఒకే గణనాథుడు...

వినాయక చవితి వస్తే ఊరూరా.. వాడ వాడలా వినాయక మండపాలు కనిపిస్తాయి. తానూరు మండలం భోసి గ్రామస్తులు మాత్రం ఒకే వినాయకుని ప్రతిష్టించి ఐక్యతచాటుతూ ఆధ్యాత్మికత పంచుతున్నారు. 1963లో మొదటిసారి కర్రతో తయారు చేయించిన వినాయక విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించారు. గ్రామమంతా ప్రతీరోజు నిర్వహించే పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటూ గణపతి దీక్షలను స్వీకరిస్తారు. వీరితో పాటు కుటుంబీకులంతా పూజాకార్యక్రమానికి వచ్చి గణనాథున్ని పూజిస్తారు. వేడుకలు ముగియగానే గ్రామంలోని లక్ష్మీనారయణ ఆలయంలోని బీరవాలో కర్ర వినాయకున్ని భద్రపరుస్తారు.

ఆయన దయవల్లేనని ...

ఒకప్పుడు వ్యవసాయం పైనే ఆధారపడ్డ గ్రామంలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.స్వామి దయతోనే రైతు కుటుంబంలో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వరించిందని గ్రామస్తులు చెబుతుంటారు. విద్యార్థులు సైతం వరసిద్ధి వినాయకుడిని పూజించి ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నరని వారిలో నమ్మకం. ఈ ఏడాది మహాదేవున్ని ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. శనివారం నుంచి 11 రోజులపాటు పారాయణం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.



భోసిలో కర్ర వినాయకుడు

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీఎస్పీ గంగారెడ్డి

సారంగపూర్: గణపతి నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలంలోని ఆయా గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వహణ, భద్రత, నిర్వాహకుల బాధ్యతేనని అన్నారు. ప్రతీ మండపం వివరాలను నిర్వాహకులే ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చే పెద్ద పెద్ద డీజేలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిమజ్జనం సందర్భంగా ఎవరైనా న్యూసెన్స్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. విద్యుత్ ఏర్పాటు అంశంపై ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ మాట్లాడుతూ ప్రతీ మండపం నిర్వాహకులు విద్యుత్ శాఖకు డీడీలు చెల్లించాకే విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాలు మినహా ప్రతి ఒక్కరు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్, మండలంలోని ఆయా గ్రామాల గణేశ్ మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

ధరణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై తహసీల్దార్లతో శుక్రవారం సమీక్షించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తించి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. కాళేశ్వరం 27, 28 ప్యాకేజీలో భాగంగా మండలాల వారీగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ లక్ష్మి, ఈడీఎం నదీమ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

హెచ్‌ఐవీపై అప్రమత్తత అవసరం

- సెక్టోరియల్ అధికారి పద్మ

నిర్మల్‌చైన్‌గేట్: హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరీక్షల విభాగం సెక్టోరియల్ అధికారి పద్మ అన్నారు. పట్టణంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ నిర్ధారణ, నివారణ మార్గాలను వివరించారు. గ్రామీణ సపోర్టు ఫౌండేషన్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్, హేమలత, రాజేందర్, శ్రీనివాస్, సురేందర్ ఆశాకిరణ్, సునీత, మసుద్దీన్, సత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి పద్మ

న్యూస్‌రీల్

ప్రొఫెసర్‌కు పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న వెల్మల మధు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వృక్షశాస్త్ర నిపుణుడు, అసోసియేట్ ప్రొఫెసర్ వెల్మల మధు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాన్ని స్వీకరించారు. వెల్మల మధు ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పురస్కారం పొందడంపై జిల్లాకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

సుద్దముక్కపై వినాయకుడు



నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని దర్యాపూర్ గ్రామానికి చెందిన గుండోజి గణేశ్ సుద్దముక్కపై వినాయకుడి ప్రతిమ చెక్కి అబ్బురపరిచాడు. ఈయన గతంలోనూ సుద్దముక్కపై చంద్రయాన్–3 రాకెట్ నమూనా సూక్ష్మఖండాన్ని తీర్చిదిద్దాడు.



ట్రిపుల్‌ఐటీలో కొనసాగుతున్న నిరసన



బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం సాయంత్రం వర్షంలో విద్యార్థులు నిరసన కొనసాగించారు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన గేటు వద్ద మీడియాను నిలిపివేశారు. విద్యార్థులంతా వర్షంలో తడుస్తూ నిరసన కొనసాగించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన కొనసాగించారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సోలిడారిటీ(టీఎస్ఏఎస్) ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతుంది. ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు మద్దతుగా పలు విద్యార్థి సంఘాలు అక్కడికిచేరుకున్న ప్రధానగేటు వద్దే వారిని అడ్డుకున్నారు.

విద్యార్థులకు బెదిరింపులు..

ఆందోళన చేస్తున్న విద్యార్థులను వర్సిటీ అధికారులు భయపెడుతున్నారు. ఆందోళనలో పాల్గొంటే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా విద్యార్థులు వెనక్కి తగ్గడంలేదు. దీంతో ఎలాగైనా ఆందోళనలు విరమింపజేయాలని ట్రిపుల్‌ఐటీ ఉన్నతాధికారులు గ్రూపులుగా విద్యార్థులను పిలిచి మాట్లాడే ప్రయత్నంచేస్తున్నారు. డిమాండ్లు పరిష్కరించకుండా విద్యార్థులను ఇలా భయాందోళనకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

10న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణంలో ప్రతీ ఆది, బుధవారాల్లో నిర్వహించే వారసంతతోపాటు దినసరి సంతలో పన్నుల వసూలుకు నిర్వహించే తైబజార్‌కు ఈనెల 10న వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. 2024–25 సంవత్సరానికిగానూ 7 నెలలపాటు తైబజార్ ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు లక్ష రూపాయల డీడీని మున్సిపల్ కమిషనర్ పేరిట తీసి ఈ నెల 9వ తేదీలోగా కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిర్మల్‌టౌన్: పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలో చేపడుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డుల్లో నిత్యం చెత్త సేకరణ చేపట్టాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

ఖానాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన తునికి నిశితవర్ధిని ఇటీవల రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవల మూడురోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నిశితవర్ధిని రజత పతకం సాధించింది. విద్యార్థినిని హెచ్ఎం బోనగిరి నరేందర్‌రావు, పీఈటీ ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జనరల్ ఆసుపత్రిలో ఎస్‌డీపీ యంత్రం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ అభిలాష అభినవ్ చొరవతో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్ అందుబాటులోకి వచ్చిందని ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ పరికరం ద్వారా జనరల్ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ అయిన వారికోసం ఎస్‌డీపీ డోనర్లు అందుబాటులో ఉంటే సదరు పేషెంట్‌కు ఉచితంగా ప్లేట్‌లెట్లు ఎక్కించడం జరుగుతుందన్నారు. ఇటీవల సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన మహిళకు 19 వేల ప్లేట్‌లెట్ కౌంట్ ఉంటే జిల్లా ఉచితంగా ప్లేట్‌లెట్లు ఎక్కించామని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

బోథ్: మండల కేంద్రంలోని పెద్దవాగులో వొడ్నాల పోసాని(55) అనే మహిళ బట్టలు ఉతుకుతూ కొట్టుకుపోయి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రజక కులానికి చెందిన పోశెట్టి– పోసాని దంపతులు వృత్తి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం పెద్దవాగు బ్రిడ్జి కింది భాగంలో దంపతులిద్దరూ బట్టలు ఉతుకుతున్నారు. ఓ చీర వాగులో కొట్టుకుపోతున్న క్రమంలో పోసాని దానిని పట్టుకునే క్రమంలో లోతు ప్రాంతంలోకి వెళ్లింది. ఈ క్రమంలో కొట్టుకుపోయింది. గమనించిన భర్త ఆమెను కాపాడేందుకు వెళ్లగా అతను కూడా కొట్టుకుపోతున్న క్రమంలో స్థానికులు అతడిని కాపాడారు. పోసాని కొంత దూరంలో బండరాళ్ల మధ్య మృతి చెంది కనిపించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అక్కడికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ. 10వేలు అందించారు.

‘కడెం’కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు 4,922 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక గేటు ఎత్తి 4,355 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు. ప్రస్తుతం 697.375 అడుగులు ఉంది.

ఎల్ఐసీతో పాలసీదారులకు ధీమా


మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: ఎల్ఐసీతో పాలసీదారులకు ధీమా లభిస్తుందని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో నిర్వహించిన సంస్థ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవిత బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌కుమార్, డెవలప్ ఆఫీసర్స్ గంగారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, శ్రవణ్‌కుమార్, సాయినాథ్, రవి, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో కోచ్‌లు మోకనపల్లి నరేశ్, మోకనపల్లి శశిధర్ తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో నిర్వహించిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్స్ తైక్వాండో లీగ్–2024లో మోకనపల్లి నాగలక్ష్మి, ఎండీ.అఫ్రీన్ కాతున్, జి.మణిప్రియ, బి.నిఖిత ప్రతిభ కనబర్చగా ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 14వరకు తమిళనాడులోని దిండిగల్‌లో జరిగే నేషనల్ ఖేలో ఇండియా తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిని తైక్వాండో తెలంగాణ సెక్రెటరీ ఏ.ప్రవీణ్ కుమార్, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.రాజ్‌వీర్ అభినందించారు.

మట్టి వినాయక @ 66


చెన్నూర్ విశ్వకర్మ కాలనీలో మట్టి విగ్రహం తయారు చేస్తూ..


విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండపం కోసం సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

- ఆరున్నర దశాబ్దాలుగా ఏర్పాటు
- నానయ్య పంతులు దూరదృష్టి
- ఉత్సవాలు ముగిసే వరకు భజన
- నిమజ్జనంలో డీజేలు, డప్పు చప్పుళ్లు ఉండవు..

చెన్నూర్: ఆరున్నర దశాబ్దాల క్రితం మట్టి వినాయక ప్రతిమ ఏర్పాటుకు బీజం పడింది. ఆ ఆచారం అనాదిగా కొనసాగుతూ వస్తోంది. దూరదృష్టితో ఆలోచించి నానయ్య పంతులు వేసిన మట్టి గణపతి తయారీ పునాది నేటికీ కొనసాగుతోంది. చెన్నూర్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు గత అరవై ఆరేళ్లుగా మట్టి గణపతిని స్వయంగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1958 సంవత్సరంలో అకినపల్లి నానయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమయంలో ఆయన మిత్ర బృందం లక్ష్మయ్య, మల్లయ్యలతో కలిసి మట్టి గణపతిని తయారు చేశారు. విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ గణేశ్ మండలి పేరుతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు వరకు ప్రతీరోజు రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. నిమజ్జన సందర్భంగా నలుగురు వ్యక్తులు విగ్రహాన్ని మోసుకుంటూ వెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేసే వారని శంకరయ్య తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండలి వద్ద భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీరోజు భజన చేస్తారు. నిమజ్జనం రోజు డీజేలు, డప్పుచప్పుళ్లు లేకుండా భజన చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు.

నాడు పక్షం రోజులు.. నేడు వారం రోజులు

నాడు విగ్రహం తయారు చేసేందుకు పక్షం రోజుల పాటు కష్టపడేవారు. స్వయంగా పొలాల మట్టిని తీసుకొచ్చి నియమ నిష్ఠాలతో పక్షం రోజులు మద్య, మాంసాహారాలు ముట్టకుండా తయారు చేసేవాళ్లు. ప్రస్తుతం నేటి యువకులు వినయ్‌చారి ఆధ్వర్యంలో వారం రోజుల్లో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు.

పెద్దల ఆలోచన అమోఘం..



66 ఏళ్ల క్రితం మా తండ్రి నానయ్య ఉపాధ్యాయుడిగా ఉంటూ ఆనాడు చేసిన ఆలోచనను మా తరంతోపాటు నేటి యువత సైతం పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాన్ని తయారు చేయడం సంతోషంగా ఉంది. నేడు పర్యావరణ శాస్త్రవేత్తలు సైతం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పుతున్నా.. కొందరు పెడచెవిన పెడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలి.

– అకినపల్లి సత్యనారాయణ చెన్నూర్

పుట్టమన్ను తెచ్చి... ప్రతిమలుగా మలిచి...


పంపిణీకి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలతో నర్సయ్య దంపతులు

నిర్మల్‌ఖిల్లా: అతనో పర్యావరణ ప్రేమికుడు.. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మిశ్రమంతో తయారు చేసిన గణేశ్ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని భావించి తన వంతు బాధ్యతగా అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన పుట్టమన్ను, గోమయం (ఆవు పేడ) కలిపి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. స్థానిక బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన ‘పొపెన నర్సయ్య’ ప్రకృతి ప్రసాదించిన పుట్టమన్ను, ఆవు పేడతో తయారుచేసిన ప్రతిమలను పూజించడం వల్లనే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని పేర్కొంటున్నాడు. పదేళ్లగా హైదరాబాదులోనూ పంపిణీ చేసినట్లు చెబుతున్నాడు. మట్టి గణపతినే ప్రతిఒక్కరూ ప్రతిష్ఠించి, పూజించాలని కోరుతున్నాడు. వినాయ క చవితి పర్వదినం నేపథ్యంలో ఉచితంగా గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తూ, పర్యావరణ స్ఫూర్తిని చాటుతున్న పొపెన నర్సయ్య –విజయలక్ష్మి దంపతులను పలువురు అభినందిస్తున్నారు.


విగ్రహాలను తీర్చిదిద్దుతున్న నర్సయ్య

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు


నిర్మల్‌చైన్‌గేట్: జైనూరులో గిరిజన మహిళపై జరిగిన లైంగికదాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య మాట్లాడుతూ నిందితుడు ముగ్దూంను ఉరితీయాలన్నారు. ఘటన వెలుగులోకి వచ్చి నాలుగు రోజులవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. బాధితురాకి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలుమంగ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సామ భూలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు ఆడెపు లలిత, సభ్యత్వ నమోదు జిల్లా కోకన్వీనర్ సుష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లత, అంబేకర్ దీప, సుజాత, సారిక తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై ఆటో డ్రైవర్ లైంగిక వేధింపులు?

నిర్మల్‌టౌన్: నిర్మల్ శివారు ప్రాంతంలోని ఇద్దరు బాలికలపై ఓ ఆటోడ్రైవర్ లైంగికదాడికి యత్నించాడు. నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు బాలికలు యాచన కోసం నిర్మల్‌కు వచ్చారు. స్థానిక శివాజీచౌక్ ప్రాంతంలో ఓ ఆటోడ్రైవర్ వారికి మాయమాటలు చెప్పి తన ఆటోలో ఎక్కించుకున్నాడు. పట్టణ శివారు ప్రాంతానికి తీసుకువెళ్లి, వారిపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడు. గమనించినస్థానికులు ఆటోడ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పట్టణ పోలీసులను సంప్రదించగా.. ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పెద్దమనసు చాటుకున్న చిన్నారి


పొదుపు డబ్బా పగులగొడుతున్న చిన్నారి



ఫోన్‌పే ద్వారా పంపిన రిసిప్ట్

ఖానాపూర్:వరదబాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన చిన్నారి శాన్విక నేనుసైతం అంటూ చేయూత నిచ్చింది. గ్రామానికి చెందిన సోని–శివరామకృష్ణ దంపతుల కూతురు శాన్విక పొదుపు డబ్బాలో జమచేసిన రూ.3,500 నుంచి రూ.2 వేలు తెలంగాణ సీఎం సహాయనిధికి, రూ.1,500 ఆంధ్రప్రదేశ్ సెక్రెటేరియట్‌కు ఫోన్‌పే ద్వారా పంపింపించింది.

వాగులో చిక్కుకున్న వ్యక్తి.. కాపాడిన పోలీసులు


తాడుసాయంతో గౌతంను తీస్తున్న పోలీసులు


బయట వచ్చిన బద్రె గౌతంతో పోలీసులు

తానూరు: నిర్మల్ జిల్లా తానూరు మండలం ఝరి(బి)లోలెవల్ వంతెన వాగులో చిక్కుకున్న బద్రె గౌతం అనే వ్యక్తిని పోలీసులు శుక్రవారం రాత్రి కాపాడారు. ఎస్సై సందీప్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరి(బి) గ్రామానికి చెందిన బద్రె గౌతం వడ్‌ఝరి(బి) నుంచి ఝరి(బి) గ్రామానికి కాలనినడకన వెళ్తున్నాడు. సాయంత్రం కురిసిన వర్షానికి వాగులో వరద ఒక్కసారిగా పెరగడంతో అక్కడే చిక్కున్నాడు. అక్కడి నుంచి ఫోన్‌లో గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వాగు సమీపంలో చేరుకుని తాడు సాయంతో గౌతంను బయటకు తీసుకొచ్చారు. దీంతో గౌతం ఊపిరి నిల్చుకున్నాడు. గ్రామస్తులు ఎస్సై, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం


అదుపు తప్పిన జీపు

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లే జీపు శుక్రవారం అదుపుతప్పి పక్కనే ఉన్న నీటికుంటలోకి దూసుకెళ్లింది. ఉట్నూర్ నుంచి 12మంది ప్రయాణికులతో బయలుదేరిన జీపు అల్లంపల్లి దారిలో రోడ్డుపై నుంచి అదుపుతప్పి కుంటలోకి వెళ్లి ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.మారుమూల ఆటవీ ప్రాంతంలోని అల్లంపల్లి ఉమ్మడి జీపీలో పదికిపైగా గ్రామలుంటాయి. వీరు నిత్యంమండల కేంద్రంతోపాటుగా, ఉట్నూర్, జన్నారం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పక్కా రోడ్డు లేదు. వర్షాకాలంలో రాకపోకలు సాగించాలంటే నరకయాతనే. ప్రమాదకర వాగులు, వంకలు దాటుకుంటు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు రాక ప్రాణాలు పోయిన సంఘటనలూ ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సాంబార్ ఎంకవ్వ(94) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుంటాల ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. ఎంకవ్వ గురువారం రాత్రి కల్లూరులో 61 జాతీయ రహదారి దాటి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. కల్లూరులో కిరాణా దుకాణంలో సరుకులు దింపేందుకు బొలెరో వాహనం భైంసా నుంచి వచ్చింది. అతివేగం, రాంగ్‌రూట్‌లో వచ్చిన డ్రైవర్ గమనించక వృద్ధురాలిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఎంకవ్వను 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి మనుమడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మతిస్థిమితం లేని యువతిపై అఘాయిత్యం

- గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి
- కడుపులోనే పిండం మృతి.. తొలగించిన వైద్యులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌కు చెందిన మతిస్థిమితం లేని యువతిపై గుర్తుతెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె గర్భందాల్చి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షలు చేసన డాక్టర్లు... యువతి కడుపులో మృత పిండం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీశారు. లేదంటే యువతి ప్రాణాలకు ముప్పు జరిగేదని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇటీవలే ఆ పిండాన్ని గ్రామసమీపంలో పూడ్చిపెట్టారు. విషయం పోలీసులకు తెలియడంతో శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. పూడ్చిన ప్రాంతాన్ని తవ్వించి పిండం బయటకు తీయించారు. శాంపిల్స్ సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో రైతుకూలీ మృతి

- పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగ తగిలి మృత్యువాత


పంట చేలో గంగారాం మృతదేహం

బజార్‌హత్నూర్: అటవీ జంతువుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఓ రైతు కూలీ ప్రాణం తీసింది. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాడగూడ గ్రామానికి చెందిన కొడప గంగారాం(45) గురువారం సాయంత్రం ఓ రైతు చేనులో పనులకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు పంట చేల వద్ద వెదికారు. ఈ క్రమంలో చిక్రం లక్ష్మణ్ చేనులో అడవి జంతువుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగకు తగిలి మృతి చెంది విగత జీవిగా కనిపించాడు. గంగారాం పనికి వెళ్లి వచ్చే క్రమంలో లక్ష్మణ్ చేనులో ఉన్న విద్యుత్ తీగకు తగిలినట్లుగా భావిస్తున్నారు. మృతుడి భార్య తులసీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్నాడని ఆత్మహత్య


అంకం పెద్ద రాజన్న (ఫైల్)

సోన్: మధ్యవర్తిగా ఉన్నందుకు డబ్బుల కోసం తనను వేధిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోన్ మండలం కడ్తాల్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహేశ్ నుంచి షబ్బీర్ అనే వ్యక్తి మూడు నెలల క్రితం గొర్రెలు కొనుగోలు చేశాడు. ఈ సమయంలో కడ్తాల్ గ్రామానికి చెందిన అంకం పెద్ద రాజన్న (60) మధ్యవర్తిగా ఉన్నాడు. మూడు నెలలు గడిచినా షబ్బీర్ గొర్రెల డబ్బులను మహేశ్‌కు ఇవ్వలేదు. దీంతో మహేశ్ మధ్యవర్తిగా ఉన్న రాజన్నకు నిత్యం ఫోన్‌చేసి ఒత్తిడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన రాజన్న శుక్రవారం ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహేశ్, షబ్బీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

- ఆరుగురు మహిళలు, ఏడుగురు విటుల అరెస్ట్
- గత జూలైలో అదే లాడ్జి యజమాని అరెస్ట్


వ్యభిచార ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జూలై 25న స్థానిక ఐబీ చౌరస్తాలోని సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో లాడ్జి యజమానితోపాటు ఇద్దరు యువకులు, ముగ్గు రు మహిళలు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటన ప్రజలు మరువక ముందే తాజాగా శు క్రవారం అదే లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతు న్న ఆరుగురు మహిళలు, లాడ్జి నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. లాడ్జి యజమాని జిల్లాలో రా జకీయంగా పేరున్న వ్యక్తి కావడం, రెండు సార్లు అదే లాడ్జిలో దందా సాగిస్తూ పట్టుబడడం చర్చనీయాంశమైంది. గత నెల 21న జిల్లా కేంద్రంలో ని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌లో ఏడుగురు విటులు, ఓ మహిళను పోలీ సులు అరెస్టు చేశారు. శుక్రవారం సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో వ్యభిచారం జరుగుతోందని అందిన సమాచారం మేరకు సీఐ బన్సిలాల్ సి బ్బందితో ఆకస్మికంగా మెరుపు దాడి చేశారు. ఆ రుగురు మహిళలు, ఆరుగురు పురుషులు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారని సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బెల్లంపల్లి మండలం ఆకెనపెల్లికి చెందిన సుంకరి శివయ్య, గోదావరిఖనికి చెందిన మందాల శివ అశీష్, ఆకుల ప్రశాంత్, రౌతు కార్తీక్, లక్సెట్టిపేటకు చెందిన తిరుపతి, పె ద్దపల్లి జిల్లా వెల్గటూర్‌కు చెందిన గోస్కుల ప్రశాంత్‌తోపాటు లాడ్జి నిర్వాహకుడు మోతం జనార్దన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మహిళలను సఖీ సెంటర్‌కు తరలించామని పేర్కొన్నారు. విటులు లాడ్జి నిర్వాహకుడికి చెల్లించిన రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నామని, వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్న లాడ్జి యజమాని సిరపురం శ్రీనివా సను త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు.